క్లుప్తంగా

రేపటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

పట్నంబజారు: నగరంలో బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలో గల కోడిగుడ్డు సత్రం వద్ద డ్రైనేజీ కల్వర్టు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 17నుంచి ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎం. శ్రీనివాసరావు చెప్పారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొన్నూరు రోడ్డు వైపు నుంచి గుంటూరు నగరంలోకి వచ్చే రోడ్డులో ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలకు ప్రవేశం లేదని తెలిపారు. ఆయా వాహనాలు ఏటుకూరు బైపాస్, ఆటోనగర్‌ల మీదుగా నగరంలోకి ప్రవేశించాలని సూచించారు. పొన్నూరు రోడ్డునుంచి వచ్చేఆటోలు, ద్విచక్ర వాహనాలు, కారులు, ఇతర చిన్న వాహనాలు కోడిగుడ్డు సత్రం కుడివైపునకు తిరిగి, పాత గుంటూరు మీదుగా జిన్నాటవర్ వైపు వెళ్లాలని ఆయన తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి జిన్నా టవర్ వైపు వెళ్లాల్సిన వాహనాలు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ మీదుగా కొత్త అన్నా క్యాంటిన్ వైపు నుంచి వెళ్లాలని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌కు మార్కెట్ వైపు నుంచి వాహనాలు ఎప్పటిలాగే వెళ్లవచ్చని తెలిపారు. డ్రైనేజీ కల్వర్టుల నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు నిర్ణయాలకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



నెహ్రూనగర్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన ఆహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా జీవించవచ్చని 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రోషన్ తెలిపారు. డివిజన్ పరిధిలో శుక్రవారం బాలింతలకు, గర్భిణులకు టేక్ హోం రేషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారంతా అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరిగే పని లేకుండా ప్రభుత్వమే టేక్ హోం రేషన్ కిట్లు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జీజీహెచ్‌లో జనరిక్ మందుల షాపునకు శంకుస్థాపన



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శుక్రవారం జనరిక్ మందుల షాపు నిర్మాణానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. జీజీహెచ్ అభివృద్ధి కోసం రూ. 5 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. స్టెప్ డౌన్ వార్డు ఆధునీకరణలో భాగంగా జనరిక్ మందుల షాపును మరో చోటకు తరలించి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాసప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డీఆర్‌డీపీ ప్రాజెక్ట్ మేనేజర్ కె.పున్నారావు, జెనరిక్ మెడికల్ షాప్స్ ఇంచార్జి షంషీర్, శారమ్మ పాల్గొన్నారు.

'ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0'కు స్పందన

నెహ్రూనగర్: ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో నగరంలోని విద్యార్థులు పెద్దఎత్తున భాగస్వాములు కావడం అభినందనీయమని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ -2023లో భాగంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 సెల్ఫీ కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియన్ స్వచ్ఛ లీగ్‌లో నగర ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేస్తూ, నగరానికి జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంక్ తీసుకురావడానికి భాగస్వాములు అవుతున్నారని ఆమె పేర్కొన్నారు. వార్డు సచివాలయాల వారీగా కార్యదర్శులు, నోడల్ అధికారులు, డెప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని విద్యా సంస్థలు, వాకింగ్ ట్రాక్‌ల్లో విద్యార్థులు, ప్రజలకు స్వచ్ఛ లీగ్‌పై అవగాహన కలిగిస్తున్నారని వివరించారు. ఈ సెల్ఫీ క్యాంపెయిన్‌ని, ఆదివారం కూడా జరుగుతుందని ఆమె వెల్లడించారు. బీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగే మెగా సెల్ఫీ కార్యక్రమంలో కూడా విద్యార్థులు, యువత పాల్గొని, గుంటూరు నగర ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరోసారి చాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

'రజకులను కించపరిస్తే సహించేది లేదు'

నెహ్రూనగర్: కులవృత్తిపై ఆధారపడి జీవించే రజకుల్ని ఉద్దేశపూర్వకంగా, కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని జాతీయ ధోబీ మహాసంఘ్ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. అమరావతి రోడ్డులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ బెంగుళూరులో టీడీపీ నేతలు చేపట్టిన దీక్షలో ఓ మహిళా నాయకురాలు రజకులను కించపరుస్తూ, తమ మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కమిషనర్ కీర్తి చేకూరి



కార్పొరేటర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలపై విభాగాధిపతులు వేగంగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం నగర కార్పొరేటర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుంటే ప్రజల సమస్యల పరిష్కారం వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు తనతో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరి ఉన్నందున ప్రతి శుక్రవారం దీనికి అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం ఇటీవల స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ వచ్చిన సందర్భంగా కమిషనర్‌ను డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు పూల బోకే అందించి, శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తే ప్రజల సహకారంతో నగర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా



శంకుస్థాపన చేస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు శుక్రవారం 57వ డివిజన్ అంబేడ్కర్ నగర్ 1వ లైనులో రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని శివారు కాలనీలు, వెనుకబడ్డ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పఠాన్ నూర్‌ఖాన్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా శుక్రవారం 3వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ పోలవరపు జ్యోతితో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవర్గాలకు పింఛన్ సొమ్ము ఎంతో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్ కాంక్షిస్తారు కాబట్టే ఆయన్ను రానున్న ఎన్నికల్లో తిరిగి సీఎంని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వెంకటేశ్వరరావు, తోట ఆంజనేయులు, మహేష్, స్వర్ణ, బ్రహ్మనాయుడు, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నెహ్రూనగర్: సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ సమన్వయకర్త, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి తెలిపారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శుక్రవారం అరండల్‌పేటలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురవాచారి మాట్లాడుతూ గతంలో విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే జరపాలని పాలకులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని అడిగిన వెంటనే జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయాలని అధికారుల్ని ఆదేశించడం అభినందనీయమని తెలిపారు. ఆనాడు మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ప్రతిపాదించారని, ఆయన మరణంతో దాన్ని మరుగున పడేశారని తెలిపారు. నేడు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కడియాల సుబ్బారావు, సున్నం మల్లికార్జున, ఉమ్మరోజు నాగేశ్వరచారి, మేడూరి శివరామకృష్ణ, పి. నాగబ్రహ్మం పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా విశ్వకర్మ జయంతి నిర్వహణపై హర్షం

నెహ్రూనగర్: విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పావులూరు హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు. అరండల్‌పేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న వేడుకలు, పూర్ణాహుతిలో విశ్వబ్రాహ్మణులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: కాకుమానువారితోట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు వసంతరాయపురం, బొంగరాలబీడు, సంజీవయ్యనగర్, వెంగళరావునగర్, వెంగయ్యనగర్, శాంతిపేట, నిరుపేదల కాలనీ, కాకుమానువారితోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు మధువని స్వర నీరాజనం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం స్వర నీరాజనం పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు మధువని సుస్వరాల పల్లకి వ్యవస్థాపకుడు వి. మధుబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

బాపయ్య చౌదరి సేవలు చిరస్మరణీయం

రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ

కొరిటెపాడు(గుంటూరు): 1975–76లో గోరంట్ల పరంధామయ్య అధ్యక్షుడిగా ఏర్పడిన ఏపీ కాటన్ అసోసియేషన్‌కు వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేసిన కె.బాపయ్య చౌదరి మరణం కాటన్ అసోసియేషన్, వ్యాపారవేత్తలు, కుటుంబ సభ్యులకు తీరని లోటని రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపురంలోని ఏపీ కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం బాపయ్య చౌదరి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ కాటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రాఘవరావు, కె.రామారావు, మాజీ అధ్యక్షుడు జి.పున్నయ్య చౌదరి, డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, విద్యావేత్త పాతూరి కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ పాల్గొన్నారు.

పండుగనాడు మట్టి వినాయకుడిని పూజిద్దాం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



మట్టి వినాయక ప్రతిమలను పరిశీలిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): మట్టి వినాయకుడి పూజతో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఈ ఏడాది మొదటి పండుగ వినాయకచవితి జరుపుకోవాలని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మట్టి వినాయకుడిని పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో మట్టి విగ్రహాల తయారీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ 2027 నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించుకుందామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపును బజరంగ్ ఫౌండేషన్ స్వాగతించి, సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు. మట్టి గణపతిని పూజించాలంటూ పెద్దఎత్తున ప్రచారంతో పాటు ప్రతిమల పంపిణీని బజరంగ్ ఫౌండేషన్ గత ఏడాది నుంచి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి వినాయకుల్ని పూజించి పర్యావరణానికి మేలు చేయాలని మురళీకృష్ణ సూచించారు. మట్టి విగ్రహాల నిమజ్జనం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం నుంచి పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయం ఆవరణలో, పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఐదు వేలకు పైగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీని చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఎంబీబీఎస్ రెండో రౌండ్ అడ్మిషన్స్‌లో రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం

మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్: ఎంబీబీఎస్ రెండో రౌండ్ అడ్మిషన్స్‌లో రిజర్వేషన్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక అమరావతి రోడ్డులోని ఆలా హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు 54,000 ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు రిజర్వేషన్ కేటగిరిలో, 60,000 ర్యాంక్ వచ్చిన అభ్యర్థులకు ఓపెన్ కేటగిరిలో సీట్లు కేటాయించారని వెల్లడించారు. ఓపెన్ కాంపిటీషన్‌లో ఎంబీబీఎస్ సీటు పొందేందుకు అర్హత ఉన్న రిజర్వేషన్ అభ్యర్థులకు ఆ కేటగిరిలో సీట్లు కేటాయించలేదన్నారు. రిజర్వేషన్ కేటగిరిలో కేటాయించడం వల్ల ఆ కేటగిరిలో సీట్లు పొందాల్సిన అనేక మంది రిజర్వేషన్ అభ్యర్థులు ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు నిబంధనల మేరకు మొట్టమొదట ఓపెన్ కేటగిరి సీట్లను కేవలం ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలన్నారు. కోర్టు తీర్పు ప్రకారం 54 వేల ర్యాంక్ పొందిన రిజర్వేషన్ వర్గాల అభ్యర్థికి రిజర్వేషన్ కేటగిరిలో సీటు కేటాయించి, 60 వేల ర్యాంక్ పొందిన అభ్యర్థికి ఓపెన్ కేటగిరిలో ఏ విధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. 2020లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచన మేరకు మన రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైలెవెల్ కమిటీ ఇచ్చిన నివేదికను అనుసరించి జీవో నంబరు 111ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని చెప్పారు. వన్ టైమ్ ఆల్ ఆప్షన్స్ అనే నిబంధన దీనివల్ల అమల్లోకి వచ్చిందన్నారు. ఒకసారి అభ్యర్థులు పెట్టిన ఆప్షన్స్‌ను ఎవరూ మార్చే అధికారం లేదని తెలిపారు. అయితే, యూనివర్సిటీ అధికారులు చట్ట విరుద్ధంగా అభ్యర్థులు పెట్టుకొన్న కొన్ని ఆప్షన్స్‌ను తొలగించి తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి ఓపెన్ కాంపిటీషన్‌లో, ఎక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థికి రిజర్వేషన్‌లో సీట్లు కేటాయించి రిజర్వేషన్ అభ్యర్థులకు ద్రోహం తలపెట్టారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రెండవ రౌండ్ ఎంబీబీఎస్ అడ్మిషన్లను తక్షణమే రద్దు చేసి నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు కోరారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకుల వారితోటలో నివసించే షేక్ రిజ్వాన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నెల కిందట హార్ట్ స్టార్ యాప్‌లో సబ్‌క్రిప్షన్ చెల్లించాడు. తరువాత నెలలోనూ ఆటోమ్యాటిక్‌గా సబ్‌క్రిప్షన్ నగదు చెల్లింపులు జరిగాయి. దీంతో రిజ్వాన్ గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబరు సెర్చ్ చేసి దానికి ఫోన్ చేశాడు. అవతల వారు కంప్యూటర్‌లో ఎనీ డెస్క్ ఓపెన్ చేయమని కోరగా, రిజ్వాన్ దాన్ని చేసి, అవతలవారు చెప్పిన సమాచారాన్ని అనుసరించాడు. అనంతరం రెండు విడతలుగా అతని అకౌంట్‌లోని రూ. 53వేలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన రిజ్వాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై దాడి చేసిన యువకుడు

ముగ్గురిపై యువకుడు దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 6వ లైనులో నివసించే సుభాని మటన్ షాపులో షఫ్రూద్దీన్ పని చేసేవాడు. అతడి వద్ద పనిమానేసి షఫ్రూద్దీన్ వేరే చోట చేరాడు. దీనిపై అతడ్ని సుభాని కొట్టి గాయపరిచాడు. ఇది మనస్సులో పెట్టుకున్న షఫ్రూద్దీన్ శుక్రవారం సుభాని ఇంటికి వెళ్లి అతడితో పాటు తండ్రి జిలాని, తల్లి హలీమాలను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు చెల్లించమన్నందుకు దూషణ

అప్పు చెల్లించమన్నందుకు దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేటలోని ఓ సంస్థలో విజయలక్ష్మి, శ్రావ్య టెలీకాలర్లుగా పనిచేశారు. ఈ సమయంలో విజయలక్ష్మి వద్ద శ్రావ్య రూ. 80వేలు అప్పుగా తీసుకుంది. తర్వాత సంస్థలో పని చేయడం మానేసింది. విజయలక్ష్మి డబ్బులు అడగ్గా శ్రావ్య దూషించడంతో పాటు సెల్‌ఫోన్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెట్టింది. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఏకనాథ్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణనగర్‌కు చెందిన ఓ వివాహిత ఈనెల 12వ తేదీ ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కారు చోరీ కేసులో నిందితుడ్ని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన పోలిశెట్టి కార్తిక్ ఈనెల 10న రిజర్వ్ ఎస్ఐగా పనిచేసే మదన్‌మోహన్ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలకు వెళ్లి కారు తాళాలు, సెల్‌ఫోన్ తీసుకున్నాడు. తర్వాత కారులో ఉడాయించాడు. మదన్‌మోహన్ ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కార్తిక్‌ను అరెస్టు చేసి సెల్‌ఫోన్, కారు స్వాధీనం చేసుకున్నారు.

మోహన్ కుటుంబ సభ్యుల్ని ఓదార్చిన అప్పిరెడ్డి



గుంటూరు ఈస్ట్: ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షల్లో మృతి చెందిన యువకుడు నేలటూరి మోహన్ భౌతికకాయాన్ని జీజీహెచ్ మార్చురీలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం సందర్శించి, నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యుల్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ సంఘటన దురదృష్టకరమని, తల్లిదండ్రులకు తీరని శోకమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం



మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు



సుమేధ హైస్కూల్లో వీరరాఘవరావును సత్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక భారతావని నిర్మాణం కోసం ప్రణాళికలు రచించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రస్తుత ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత అని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు పేర్కొన్నారు. భారతదేశ తొలి సివిల్ ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రభాకరరావు మాట్లాడుతూ భారతదేశ తొలి ఇంజినీర్‌గా దేశాభివృద్ధికి మోక్షగుండం బాట లు వేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని ఇనుమడింపచేసిన 'మోక్షగుండం'

గుంటూరు ఎడ్యుకేషన్: నీటి పారుదల రంగంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేశారని ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ డాక్టర్ వీర రాఘవరావు పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శుక్రవారం ఇంజినీర్స్ డే సందర్భంగా ప్లానింగ్ ఫర్ సక్సెస్ పేరుతో విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీర రాఘవరావు మాట్లాడుతూ సివిల్ ఇంజినీర్‌గా విశ్వేశ్వరయ్య ఆనకట్టల నిర్మాణంతో పాటు నీటి పారుదల రంగంలో అందించిన సేవలకు గుర్తింపు భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సత్కరించినట్లు చెప్పారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో చదువుకుని ఇంజినీర్లుగా ఎదిగి, భారతదేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వవిఖ్యాత ఇంజినీర్

లక్ష్మీపురం: విశ్వవిఖ్యాత ఇంజినీర్‌గా అఖండ కీర్తిని ఆర్జించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సీనియర్ ఇంజినీర్ ఎన్. సదాశివం కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంజినీర్స్ డే నిర్వహించారు. మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదాశివం మాట్లాడుతూ అశేష ప్రజానీకానికి ప్రయోజనకరంగా వివిధ రంగాల్లో దేశ సిరిసంపదలను, కీర్తి ప్రతిష్టలను పెంపొందించిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత ఇంజినీర్ ఎన్.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య దూరదృష్టితో దేశ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

పలు సవాళ్లు ప్రజాస్వామ్య విలువల్ని దిగజారుస్తున్నా ఇప్పటికే దేశంలో ప్రజాస్వామ్యం సాఫీగానే కొనసాగుతోందని, భారతవనికి బలం, బలహీనతా ప్రజాస్వామ్యమే అని విశ్రాంత రాజనీతి శాస్త్రవేత్త ఎస్.తిరుపతయ్య తెలిపారు. అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతం విశ్వమానవాళికి ఉదాహరణగా సగర్వంగా, నిబ్బరంగా నిలుస్తుందని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఈ.చంద్రయ్య పాల్గొన్నారు.

హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో సమయస్ఫూర్తి, మంచి స్నేహితులు, విలువలతో కూడిన విద్యా విధానాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో విజయానికి సోపానంగా నిలుస్తాయని డెవలప్ ట్రీస్ సీఈవో దగ్గుబాటి శ్రావణ్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం శిలన్యా-2023 పేరుతో ఇంజినీర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రావణ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాన్ని సాధించేందుకు కావాల్సిన నైపుణ్యాలు, మెలకువలను విద్యార్థులకు వివరించారు. తొలుత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంకేతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో ఆధునిక సాంకేతిక పద్ధతులు జోడించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: నిర్మాణాల్లో ఆధునిక సాంకేతిక పద్ధతుల్ని జోడించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలునాయక్ సూచించారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సివిల్ ఇంజినీరింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలునాయక్ మాట్లాడుతూ నేడు ప్రాజెక్టులు, భవనాల నిర్మాణాల్లో ఎన్నో నూతన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా భవన నిర్మాణాలు, యూపీవీసీ కిటికీలు, భవనాలకు మరమ్మతులకు సంబంధించిన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్ చీఫ్ ఇంజినీర్ కె. అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్ఈ జి. బ్రహ్మయ్య, ఈఈ జి. ముత్యంబాబు, ఇంజినీర్స్ డే ఉత్సవ కమిటీ కన్వీనర్ జెడ్. రమేష్, ఏపీపీఆర్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు వి. మురళీకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి కె. సంగీతరావు, ఇంజినీర్లు జి. అశోక్, బి.రత్నబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద శ్రావణ్, రామకృష్ణమూర్తి, సుబ్బారావు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలునాయక్ తదితరులు